# "కుడి ఎడమలు"

గోదావరి సుళ్ళు తిరుగుతూ పరవళ్ళు తొక్కుతున్నది.
పాపికొండలమధ్య పడవఒడుదుడుకుగా సాగిపోతున్నది.
పడవనిండా ప్రయాణీకులు కిక్కిరిసి కూర్చున్నారు.
వారిలో కొందరు పడవ కుడివైపుగా కూర్చున్నారు.
కొందరు ఎడమవైపుగా కూర్చున్నారు.

మధ్యగా చుక్కాని పక్కగా పడవవాడికి తిన్నగా ఎదురుగా చంటిపిల్లను ఎదకు హత్తుకుని అమాయకంగా చూస్తూ ఒదిగి కూర్చున్నది ఒక యువతి.

అలలు కొండను ఢీకొని వెనక్కి తిరిగి పడవను ఓ కుదుపు కుదిపినప్పుడల్లా పడవ కిర్రుమంటున్నది. ఆడంగులు ధరించిన హారాలు, గాజులు గలగల మంటున్నాయి.

లోకాభిరామాయణాలు, అచ్చట్లు, ముచ్చట్లు, ప్రపంచంలో మంచి చెడులమీద తీర్పులు, న్యాయాన్యాయాలు, డాబులు, దర్పాలు కోలాహలం అంతా వింటూనే వున్నాడు పడవవాడు. అతనికి నవ్వువచ్చింది. ఓ చిలిపి ఊహ తట్టింది.

పడవ తక్కున ఆగిపోయింది!

అందరి గుండెలు గతుక్కుమన్నాయి.

దేవత అలిగిందన్నాడు పడవవాడు. ఎన్ని కొబ్బరికాయలిచ్చినా అలక తీరలేదన్నాడు. చివరికి "నరబలి" ఇవ్వక తప్పదన్నాడు!

గుండెలు గొంతులో కొచ్చి చిక్కబడ్డాయి. ఒకర్ని ఒకరు చూసుకునేందుకుకూడా ధైర్యం చాలక గుడ్లు మిటక రించి కొండకొనవైపు చూస్తూ వుండిపోయారంతా.

పడవవాడి గొంతు కఠినంగా ఖంగుమని మ్రోగింది?

ఉలిక్కిపడి "ఆ ముండను తోసేస్తే సరి" అన్నారు పడవకు ఎడమవైపున కూర్చున్నవారిలో కొందరు.

కొండంత ఔదార్యం ప్రదర్శిస్తున్నట్టుగా "పెద్ద ప్రాణం దాన్నెందుకు. ఆ బిడ్డను తోసేస్తేసరి" అన్నారు పడవకు కుడివైపున కూర్చున వారిలో కొందరు.

"నువ్వు పోతే నీ మొగుడుకి యింకో పెళ్ళాం వస్తుంది" అన్నారు కొందరు వెకిలికిగా నవ్వుతూ.

"ఈ బిడ్డపోతే ఇంకో బిడ్డ పుడుతుంది" అన్నారు కొందరు ఎగతాళిగా.

ఆ యువతికి పరిస్థితి అర్థమైంది.

బిడ్డను గాఢంగా గుండెకు హత్తుకుంది. ప్రాణానికి ప్రతిఘటించింది.

పడవవాడు "నే చెప్పినట్టు చేస్తే సరి" అన్నాడు.

అందరూ అతనివైపు ఆరగా చూశారు.

చీటీలమీద మనందరి పేర్లువ్రాసి ఆ బిడ్డచేత తీయిద్దాం. ఎవరిపేరు వస్తే వాళ్ళను తోసేద్దాం, అన్నాడు యువతి ఒడిలో బిడ్డవైపు చూస్తూ.

"అయ్యబాబోయ్" అంటూ గుండెలు బాదుకున్నారు ఎవరి మటుకువారు.

"లబలబ" మంటూ నోరు కొట్టుకున్నారు.

"దబదబ" నెత్తి మొత్తుకున్నారు.

ఏడుపులు, మొత్తుకోళ్ళతో ఆలోయ లోయంతా మారుమ్రోగి పోయింది.

తమ మాట వినలేదనే కోపంతో ఆ యువతి నోటిని కొచ్చినట్లల్లా తిట్టిపోశారు.

"సిగ్గులేని చీదరముఖాలు" అని దరించుకుని పసివాడి బుగ్గలు పుణికి ముద్దుపెట్టుకుని, ఓ లల్లాయి పదం ఎత్తుకుని చేతిలో కర్రతో నీటి అడుగును బలంగా పొడిచాడు పడవ వాడు.

పడవ మామూలుగా ముందుకు సాగిపోయింది.